నేత్రపర్వం భీమేశ్వర పుష్పయాగోత్సవం

- భారీగా హాజరైన భక్తజనం
- దంపతి తాంబూలాలు ఇచ్చిన నిర్వాహకులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు


శ్రీపుష్పయాగోత్సవంలో ఊయలలో ఓలలాడుతున్న స్వామి, అమ్మవారు


శ్రీపుష్పయోగోత్సవ పూజలను తిలకిస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి శ్రీపుష్పయాగోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని పూలతో అలంకరణ చేశారు. ఈనెల 16న స్వామి వారి కల్యాణం, 18న రథోత్సవం, 20న త్రిశూల స్నానం జరిగాయి. కల్యాణ ఉత్సవాలు ముగింపులో భాగంగా శ్రీపుష్ప యాగోత్సవాన్ని వేద మంత్రాల మధ్య కల్యాణ వేదికపై స్వామి వారికి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పూలతో, వివిధ రకాల పండ్లు, మిఠాయిలతో అలంకరించి ఊయలలో స్వామి వారి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు దంపతులు, ఈఓ డి నాగమల్లేశ్వరరావు దంపతులతో పాటు ట్రస్టుబోర్డు సభ్యుల దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో బారులుతీరారు. శ్రీపుష్పయాగోత్సవాన్ని తిలకించిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు, భక్త సంఘం నాయకులు బిక్కిన సాయిపరమేశ్వరరావు, గంజి బూరయ్య, తలుపుల అంజనీకుమార్, చల్లా సత్తిబాబు, బీవీ రమణ భక్తులకు సేవలందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, చెరుకూరి భీమన్న, శ్రీకాకుళపు వినయ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కన్నుల పండువగా కుక్కుటేశ్వరుని పుష్పోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు


శ్రీపుష్పోత్సవ అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి


రాజరాజేశ్వరి అమ్మవారు


పుష్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామివారికి మంగళవారం రాత్రి నిర్వహించిన పుష్పోత్సవంతో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. మంగళవారం ఉదయం కుక్కుటేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి మంగళస్నానాలు చేయించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారికి మహారుద్రాభిషేకం చేసి, పుష్పోత్సవ అలంకరణ చేశారు. అమ్మవారికి కుంకుమార్చన అనంతరం పుష్పాలతో అలంకరించారు. భారీగా తరలివచ్చిన ముత్తైదువులకు ప్రత్యేక పూజలు చేసి తాంబూలాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన పుష్పోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈవోలు ఆర్.సౌజన్య, శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి వారికి శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామివారిని పూలతో సుందరంగా అలంకరించి ముత్తైదువులు శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.


స్వామివారికి పుష్పయాగం

క్లుప్తంగా

రైల్వే చట్టాలపై అవగాహన అవసరం

- ఆర్పీఎఫ్ ఎస్సై రామకృష్ణ


రైల్వే చట్టాలపై అవగాహన అనంతరం యువతతో ఆర్పీఎఫ్ ఎస్సై రామకృష్ణ

సామర్లకోట: రైల్వే చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్పీఎఫ్ ఎస్సై పి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జి.మేడపాడులోని యువతకు రైల్వే చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఆకతాయిలు రైళ్లపై రాళ్లు రువ్వడంతో పాటు పట్టాలపై రాళ్లు పెడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై రైల్వే రక్షణ దళం ప్రత్యేక నిఘా ఉంచినట్టు తెలిపారు. రైల్వే ఆస్తులకు నష్టం జరిగితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఎస్సై వరప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగ నాయకులు, గ్రామ పెద్దలు అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి సత్యనారాయణ

కొత్తపల్లి: సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని మండల సీఐటీయూ కార్యదర్శి కేవీ సత్యనారాయణ అన్నారు. రెడ్‌బుక్ డే సందర్భంగా స్థానికంగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆశవర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు వివిధ రంగాల్లో పని చేస్తున్న వారి సమస్యలను పరిష్కరించేందుకు పోరాడేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశ నాయకురాలు సీహెచ్ పద్మ, జిల్లా రైతు సంఘం కార్యదర్శి జి.అప్పారెడ్డి, సీటీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ కార్యదర్శి సీహెచ్ సాంబశివకుమార్, సీహెచ్ పద్మాకరరావు, ఎం.లక్ష్మి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పందుల వ్యాధులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి

కొత్తపల్లి: అమినాబాద్ గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం వైరస్ స్టిటిక్ సైన్స్‌పై వ్యాధులపై పందుల పెంపకందారులకు అవగాహన కల్పించారు. ఇటీవల మైనాది అనే వ్యాధితో పందులు చనిపోతున్నాయని, వాటిని ఎక్కడ పడితే అక్కడ వదిలేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతున్నాయని, ఈ దుర్వాసన వల్ల వల్ల ప్రజలు కూడా రోగాల బారిన పడుతున్నారు. పశువైద్యాధికారి టీఎస్ నారాయణమూర్తి మాట్లాడుతూ వ్యాధులు సోకకుండా పందులకు టీకాలు వేస్తున్నామన్నారు. వైరస్‌తో మృతి చెందిన పందులను నిప్పు అంటించి తగలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా మణికంఠబాబు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి


పీబీ దేవంలో ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ పరమహంస 188వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాత హారతి, అష్టోత్తర శతనామ పూజ, భజన, కథామృతం, విశేషాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సమితి నాయకులు వింజమూరి విశ్వనాథ్, నువ్వుల బాబ్జీ, సూర్యచంద్రరావు, తెలుగుంట్ల నరసింహారావు, నానాజీ, తోటకూర సాంబశివరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వేట్లపాలెం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు నిర్వహించారు.

నేరాలు అదుపుచేయండి

- డీఎస్పీ మురళీమోహన్
- డివిజన్ సిబ్బందితో సమీక్ష


డివిజన్ స్థాయి సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

పెద్దాపురం: సబ్ డివిజన్‌లో నేరాల అదుపునకు చర్యలు చేపట్టి, క్రైం రేట్‌ను తగ్గించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని ఆయా సర్కిల్ పరిధిలోని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గిందని, ట్రాఫిక్, గాంబ్లింగ్, జూదం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, పలు ప్రాంతాల్లో, శివారు ప్రదేశాల్లో జరుగుతున్న పేకాట, కోడి పందాల నిర్వహణతో పాటు గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని డీఎస్పీ ఆదేశించారు. అనంతరం స్టేషన్ల వారిగా పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఈ సమావేశంలో పెద్దాపురం సీఐ నబీ, ఎస్‌ఐ సురేష్‌తో పాటు ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

25న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 25వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంఎస్ భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

మాతృ భాష గొప్పతనం మరువలేనిది


సామర్లకోటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సాయిరామ కృష్ణ

సామర్లకోట: మాతృ భాష గొప్పతనం మరువలేనిదని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ ముందుగా తెలుసుకోవాలన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న మంచి విషయాలను అధ్యయనం చేయాలని, తద్వారా బహుభాషా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాతృభాషలో శతక పద్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బి.శ్రీలక్ష్మి, బి.బేబిరాణి, సీహెచ్ లక్ష్మీదుర్గ, కె. శేషారత్నం పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణకు కృషి చేద్దాం


తెలుగుతల్లి విగ్రహానికి వందనం చేస్తున్న ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఏఓ సరస్వతి తెలుగుతున్న విగ్రహానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దాపురం: శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిందేనని వక్తలు పేర్కొన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం సాయంత్రం సాహితీ స్రవంతి, యూటీఎఫ్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రెడ్‌బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త శివ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు జోస్యుల కృష్ణబాబు, చల్లా విశ్వనాథం, బి.అనంతరావు, రొంగల వీర్రాజు, బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీశ్రీని తలచుకోని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరన్నారు. 1848 ఫిబ్రవరి 21న కమ్యూనిస్టు ప్రణాళిక విడుదల చేసిన సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా రెడ్ బుక్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం కవుల ఆధ్వర్యంలో కవితా పఠనం చేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


సామర్లకోటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయీ బ్రాహ్మణులు క్షీరాభిషేకం చేశారు. వారి బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ కావడంతో సంగీత రావుపేట రామాలయంలో కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అలాగే ఆర్డినెన్స్ 3 ద్వారా దేవాలయాల ట్రస్టు బోర్డుల్లో తమ వర్గానికి శాశ్వత సభ్యులుగా అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంపై కృతజ్ఞతగా క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు నూకాలమ్మతల్లి తొలి గరగ ఉత్సవం


అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవానికి సిద్ధంగా ఉంచిన తొలిగరగ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరిందిన కాండ్రకోట నూకాలమ్మ తల్లి తొలి గరగ ఉత్సవం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గరగ ఉత్సవంలో భాగంగా ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి తొలి గరగ ఉత్సవాన్ని రాత్రి 09.01 నిమిషాలకు వేద పండితుల మంత్రాల మధ్య ప్రత్యేక పూజల అనంతరం ఆలయం నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

పాడి గేదె మృతి


మృతి చెందిన గేదె

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన కోరంటి శ్రీనుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డులో ఉన్న పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ తీగల తెగిపడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె సుమారు లక్ష రూపాయల విలువ చేస్తుందని రైతు తెలిపారు. జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు మృతి చెందిన గేదెను పరిశీలించారు. రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు.

ఉగాది నాటికి ఇళ్లు పూర్తిచేయాలి

- జగనన్న కాలనీల పరిశీలన
- డీఎల్‌పీఓ నారాయణమూర్తి


వేట్లపాలెంలోని జగనన్న కాలనీలను పరిశీలించిన అధికారులు

సామర్లకోట: జగనన్న కాలనీలను ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని డీఎల్‌పీఓ పి నారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాలలోని జగనన్న లే అవుట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లు లేని పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణాలకు రుణాలు అందజేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులు ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. మహిళల పేరున ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, ప్రతీ మహిళ ఎస్‌హెచ్‌జీలో సభ్యులుగా ఉండడం వల్ల బ్యాంకుల నుంచి రూ.35 వేలు అదనంగా రుణం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.1.8 లక్షలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, హౌసింగ్ డీఈ రాజు, ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీడువారిన భూమికి నీరు

- పంట పొలాలను పరిశీలించిన అధికారులు
- ఏలేరు నీటిని మళ్లించాలంటున్న రైతులు

సాక్షి ఇంపాక్ట్


వీకే రాయపురంలో బీటలు వారిన పంట పొలాలను పరిశీలించిన అధికారులు, రైతులు

సామర్లకోట: బీటలు వేసిన పంట భూములకు నీరు అందిస్తామని నీటి పారుదలశాఖ ఏఈ నాగేశ్వరరావు అన్నారు. 'అడ్డు కట్టలతో దిగువ ఆయకట్టుకు నీటి కొరత' అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏఈ తన బృందంతో గోదావరి కాలువ నుంచి పంట పొలాలకు వస్తున్న పంట కాలువలను పరిశీలించారు. వీకే రాయపురం శివారు ప్రాంతంలో ఉన్న సుమారు రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందడం లేదని అధికారులు గుర్తించారు. వంతుల వారిగా నీరు అందించడం వల్ల దిగువ ప్రాంతంలో ఉన్న వారికి 11 రోజుల తరువాత సాగునీరు వంతు వస్తుందని, దాంతో పంట పొలాలు బీటలు వేశాయని రైతులు వెలమర్తి శ్రీనివాసు, కుర్రా రాజబాబు, నాగులాపల్లి బాబులు, బొజ్జవరపు సత్తిబాబు, దేవి దుర్గ అధికారులకు వివరించారు. నీరు అందకపోతే పంటకు పెట్టుబడి వృధా అవుతుందని వారు నిలదీశారు. దాళ్వా సాగులో ఉన్న ప్రతి పంట భూమికీ నీరు అందించడానికి తమ శాఖ ప్రయత్నిస్తుందని, ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు సహకరించాలని చెప్పారు. ఎగువ ప్రాంతంలో ఉన్న పొలాలకు నీరు నిలిపివేసి బీటలువారిన పొలాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. పంట కాలువలో నీటి మట్టం పెంచకపోతే దిగువ ప్రాంతాలకు నీరు వచ్చే అవకాశం లేదని రైతులు వాపోయారు. గోదావరి కాలువలో నీటి మట్టం తక్కువగా ఉందని, సాధ్య మైనంత వరకు రైతులందరికీ నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని గోదావరి కాలువకు మళ్లించే ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

విపత్తుల నివారణపై రేపు మాక్‌డ్రిల్

- డీఆర్వో శ్రీధర్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: స్థానిక కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో గురువారం పారిశ్రామిక విపత్తుల నివారణ, నియంత్రణపై నిర్వహించనున్న మాక్‌డ్రిల్‌లో తమ సంసిద్ధతా ప్రణాళికల అమలును సమర్థవంతంగా ప్రదర్శించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి వివిధ ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక సంస్థలను కోరారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో పరిశ్రమలలో రసాయనిక విపత్తుల నియంత్రణ సంసిద్ధతపై టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ ప్రతినిధులతో కలసి పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి రాధాకృష్ణ మాట్లాడుతూ గురువారం కాకినాడ తీరంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో అమ్మోనియా వాయువు లీకేజీ విపత్తు నియంత్రణపై నిర్వహించనున్న మాక్ డ్రిల్‌పై రాష్ట్ర అధికారులకు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మిటిగేషన్ అంశాలతో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కలెక్టర్ నేతృత్వంలో పరిశ్రమలు, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పర్యావరణ, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య, వ్యవసాయ, సమాచార శాఖల అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సిబ్బంది, వివిధ పరిశ్రమల భద్రతా సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాధాకృష్ణ వివరించారు. డీఆర్వో శ్రీధర్‌రెడ్డి అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతూ మాక్‌డ్రిల్‌లో పరిశీలించిన అంశాల ఆధారంగా మరింత పటిష్టమైన విపత్తుల నివారణ, నియంత్రణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రైసిస్ గ్రూప్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.